# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి శ్రీ ధర్మాన ప్రసాదరావు గారికి వో విన్నపం

తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ వుగాది వుత్సవాలకు అతిథిగా వచ్చిన మీకు సత్కారాలతో పాటు సమస్యలతో కూడిన విన్నపాన్ని యివ్వవలసి రావడం యిబ్బందిగా వున్నా విషయ తీవ్రత వల్ల తప్పడం లేదు. మీరు అన్యథా భావించరని ఆశిస్తున్నాం.

వొక్కమాట! మేము విషయాల్ని ఆబ్జెక్టివ్‌గా చూసేవాళ్లం. అందువల్ల మాకు వ్యక్తిగత యెజెండాలు కానీ సంకుచిత, స్వీయ ప్రయోజనాలు కానీ లేవు. మేం లేవనెత్తుతున్న అంశాల్ని వాటి 'ఫేస్ వాల్యూ' రీత్యా తగిన ప్రాముఖ్యం యివ్వండి, సమస్యల పరిష్కారానికి మీ వంతుగా తోడ్పడండి.

నేడు ఆంధ్రరాష్ట్రం యెదుర్కొంటున్న సమస్యల్లో ముఖ్యమైనవీ తీవ్రమైనవీ జనజీవితాల్ని అతలాకుతలం చేస్తున్నవీ మాకు ఆందోళన కలిగిస్తున్నవి... యివి...

## అన్‌రియల్ యెస్టేట్:

విదేశాల్లో స్థిరపడి అంతోయింతో ఆర్థికంగా వెసులుబాటు వున్నవాళ్లం మేము. యీరోజు హైదరాబాద్‌లో వో యిల్లుకొనాలంటే మాకే గగనమవుతోంది. న్యూయార్క్, లండన్, ప్యారిస్‌లకు దీటుగా వున్నాయి హైదరాబాద్‌లో యిళ్లస్థలాలు. యిదంతా బలుపు అయితే సంతోషమే కానీ అది వాపు అవ్వడం; ప్రభుత్వ, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్‌లో యీ 'బూమ్'కి తలుపులు బార్లా తెరవడం ఆందోళన కలిగించే విషయం. ఆకాశాన్నంటే యీ ధరలు మా లాంటివాళ్లకే అందకపోతే సామాన్యుల గతి యేమిటి? వారి స్వంత యింటికల కల్లేనా?

వీరి పరిస్థితి యిలా వుండగా నిరుపేదలు, రైతుల జీవితాలు దినదినగండం అయ్యే దృశ్యం చూస్తున్నాం. నయానో భయానో పేదల భూముల్ని వో పక్క లాక్కుంటూ వారి జీవితాల్ని ఛిద్రం చేస్తూ మరోపక్క వాళ్లకి యిళ్లస్థలాలు, ఉపాధి హామీలు యివ్వజూపుతూ వారిని మరింత నైరాశ్యంలోకి నెట్టివేయడం దారుణం కాదా?

మా యీ ఆందోళన 'బేస్‌లెస్' కాదు. మేం 'అనవసరంగా' భయపడడం లేదు. యివిగో మచ్చుకి కొన్ని...

- రెండున్నరకోట్ల విలువ చేసే యెకరా భూమిని కేవలం యాభై లక్షల చొప్పున రాంకీ, డియల్‌యెఫ్, యిందు లాంటి సంస్థలకు హుడా కేటాయిస్తే, సదరు సంస్థలు రియల్ యెస్టేట్ వ్యాపారం చేసి కోట్లకు పడగలెత్తారు.

- యెల్ఐజీ, యెమ్ఐజీ యిళ్ల నిర్మాణం కోసం రైతుల దగ్గర తక్కువ ధరకు భూసేకరణ జరిపి హౌసింగ్ బోర్డు స్ఫూర్తికి విరుద్ధంగా బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారు. పేద రైతులు రెంటికి చెడిన రేవడి అయ్యారు.

- యిక భూసేకరణ నోటీసులతో రైతుల్ని భయభ్రాంతుల్నిచేసి, భూముల్ని సేకరించి, నోటీసులు వుపసంహరించి, రియల్ యెస్టేట్ వ్యాపారం చేసి కోట్లాది రూపాయల్ని గడించేందుకు ఎపిఐఐసి శక్తివంచన లేకుండా కృషిచేస్తోంది. దాని యింగ్లీషు అబ్రివేషన్‌ని 'ఆంధ్ర ప్రజల్ని యింతగా యిబ్బందులపాలుచేసే కార్పోరేషన్' అని చదువుకుందామా?

- యిష్ట హోటల్, యింటిగ్రేటెడ్ నాలెడ్జ్ సిటీ, జూరాంగ్ యిండియా, రహేజా - పేర్లు యేవైనా యివన్నీ అన్‌రియల్ బూమ్ సృష్టించినవే కదా?

వీటితో పాటు సెజ్‌లు యేర్పాటు చేసి, అడగనివాళ్లదే పాపమన్నట్టు భూముల్ని ధారాదత్తం చేయడం; డబ్బులు పోగుపడిన ధనవంతుల దగ్గర నామమాత్రం వసూలు చేస్తూ, పారిశ్రామికీకరణ మిషతో వాళ్లకి యెడాపెడా సబ్సిడీలిస్తూ ప్రజల ప్రయోజనాల్ని పణంగా పెట్టడం యెంతవరకు సమంజసం? దేశంలో యెక్కడా లేనంతగా 70 సెజ్‌లు ఆంధ్రప్రదేశ్‌లోనే, అందునా రంగారెడ్డి జిల్లాలో 37 సెజ్‌లు యెందుకు? యెవరికోసం? 17 వేల యెకరాలపైగా సేకరించిన భూమిలో యెన్ని పచ్చని పంటపొలాలు, పండ్లతోటలు ఆహుతయ్యాయి? యెంతమంది పేదల ఘర్మజలానికి సరైన ఖరీదు కట్టారు ప్రభుత్వ, ప్రైవేటు షరాబులు?

మంత్రిగారూ, దయచేసి మమ్మల్ని పొరబాటుగా అర్థంచేసుకోకండి. అభివృద్ధికి వ్యతిరేకులం కాదు మేము. అభివృద్ధి ఫలాలు అందరికీ అందే మానవీయమైన 'సస్టెయినబుల్ డెవలప్‌మెంట్' కావాలన్నదే మా అభిమతం. ప్రభుత్వాలకి అకౌంటబిలిటీ వుండాలంటున్నాం. పారిశ్రామికీకరణ వెలుగు మాటున నీడల్లో మగ్గుతున బడుగుల్ని పట్టించుకోమంటున్నాం. సెజ్‌లైనా, అభివృద్ధికి అవసరమయ్యే మౌలికవసతుల కల్పనైనా ప్రభుత్వ కంట్రోలింగ్, మానిటరింగ్ వుండాలంటున్నాం. మల్టీలెవల్ చెక్స్ పెట్టమంటున్నాం. కాగ్ లాంటి సంస్థల సలహాలను స్వీకరించమంటున్నాం, విమర్శలను నిర్మాణాత్మక ధోరణితో తీసుకోమంటున్నాం. వీటికితోడుగా వాచ్‌డాగ్స్, అంబుడ్స్‌మెన్ లాంటి వ్యవస్థలను నెలకొల్పమంటున్నాం. అందరి జీవితాల్లో వుగాదులూ వుషస్సులూ కోరుకుంటున్నాం.

మేము గుడ్డిగా విమర్శించడం లేదు ధర్మాన గారూ. మాకు తెలుసు ఆర్థిక వనరుల్ని పరిపుష్టం చేసుకోవడం, ఖజానా సమృద్ధిగా వుండేలా చూడడం, ఆదాయం పెంచుకోవడం యే ప్రభుత్వానికైనా అవసరం. విశేషించి వేలకోట్ల రూపాయలు ఖర్చయ్యే ప్రణాళికలు తలకెత్తుకున్న ప్రస్తుత ప్రభుత్వానికి యీ అవసరం యింకా యెక్కువగా వుంది. లేకపోతే జలయజ్ఞం, యిందిరమ్మ యిళ్లు, ఆరోగ్యశ్రీలు మూలన పడతాయి. మాకు తెల్సు, ధనార్జన జరగాల్సిందే. దానికి ప్రభుత్వం యెంచుకున్న మార్గమే అభ్యంతరకరం.

వనరుల సేకరణ అంశం పక్కదారి పట్టడం, కాకుల్ని కొట్టి గద్దలకు వేసేతీరే మా నిరసనకు కారణం.

పన్నుల వసూళ్లను మరింత కఠినం చెయ్యండి. భూముల్ని సేకరించడంలో పారదర్శకత చూపండి. లబ్దిదారులకు ప్రయోజనం అందేలా చూడండి. అన్నీ సవ్యంగా జరుగుతున్నాయో లేదో చెక్స్ పెట్టండి, సామాజిక తనిఖీలు చెయ్యండి. మీకు లభించిన అధికారాన్ని ప్రజాప్రయోజనాల సాధనకోసం వుపయోగించండి.

ధర్మాన గారూ, మీ మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాకపోయినా మీరు రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి కాబట్టి మరో విషయం మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాం.

## టూనా ప్రాజెక్ట్

మన రాష్ట్రప్రభుత్వం యీ మధ్య టూనా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనే అమెరికా కంపెనీతో వొక వొప్పందం చేసుకుంది. హిందూ మహాసముద్రంలోని భారతజలాల్లోకి ప్రవేశించడానికి అమెరికా కంపెనీకి యిది రాజమార్గం. యీ ప్రాజెక్ట్‌లో మన వాటా 51 శాతం కాగా అమెరికన్లది 49 శాతం. మనకి సాంకేతిక పరిజ్ఞానం లేదన్న కారణంగా యిరవయ్యేళ్లపాటు మన జలాల్లో టూనా చేపల్ని వేటాడేందుకు బహుళజాతి కంపెనీకి ఆమోదముద్ర వేయడం ఆత్మహత్యా సదృశం. 1600 సంవత్సరంలో యీస్టిండియా కంపెనీ యిలాగే కదా అడుగులో అడుగేస్తూ మెల్లమెల్లగా వచ్చింది? తర్వాతేమయింది. చిలకమర్తివారన్నట్టు మనం లేగదూడలై యేడుస్తుంటే తెల్లవారనే గడుసరి గొల్లవారు మన మూతులు బిగియగట్టి పాడియావు లాంటి భరతఖండాన్ని పితకలేదా? మన బతుకులు చితకలేదా?

యిరవయ్యేళ్ల తర్వాత వాళ్లు ట్రాన్స్‌ఫర్ చేసే టెక్నాలజీ, ఫిషింగ్‌బోట్స్ యేం చేసుకోవడానికి? యింతా చేసి యీ ప్రాజెక్ట్‌కయ్యే ఖర్చు కేవలం అరవై కోట్లు!

తెల్లదొరలకి మన జలాల్ని అప్పగించి వాళ్లు దోచుకెళ్తుంటే గుడ్లు అప్పగించి చూడడం తప్ప యేమైనా చెయ్యగలమా తర్వాత్తర్వాత? యీ దోపిడీ యిలా వుంటే మరోరూపంలో నల్లదొరలు కృష్ణపట్నం అల్ట్రామెగా థర్మల్ ప్లాంట్; రిలయెన్స్ విండ్ యెనర్జీ ప్లాంట్ పేరిట మన జాలర్ల నోట మట్టికొట్టడం దానికి అన్ని అనుమతులూ యిచ్చేసి చోద్యం చూస్తున్న ప్రభుత్వం...

యెందుకు యిలా మన పొలాల్నీ జలాల్నీ నల్లదొరలకీ తెల్లదొరలకీ యెడాపెడా పందేరం చెయ్యడం?

యీ టూనా వెనకాల యింకో కోణం వుంది. మధ్యధరా సముద్రంలోనూ, అట్లాంటిక్ సముద్రంలోనూ 'వోవర్ ఫిషింగ్' వల్ల టూనా చేపలు అంతరిస్తున్నాయి. పైగా అంతర్జాతీయ వొప్పందాల ప్రకారం 'రేషనింగ్' వుండడం వల్ల యింకెంత మాత్రమూ విచక్షణారహిత ఫిషింగ్ సాధ్యం కాదు. యెక్కువ గిరాకీ వున్న టూనా చేప మన చలవ వల్ల చౌకగా, సులభంగా జపాన్, అమెరికా మార్కెట్లకి తరలిపోతుంది. తమ కళ్లముందే, తమ నీళ్లలో దేవులాడి పట్టిన చేపలు తరలివెళ్తుంటే కన్నీళ్లు గుడ్లలో కుక్కుకుంటూ విలవిల్లాడే మన జాలర్ల గొడవ పట్టించుకోవాల్సిన పనిలేదా మంత్రిగారూ? వాళ్లెక్కడికి వెళ్లాలి? యెవర్నడగాలి?

అత్యంత ధనవంతులకి అడగనివానిదే పాపమన్నట్టు భూములిస్తూ, సబ్సిడీలిస్తూ వాళ్లు యెక్కడ కావాలంటే అక్కడ యేం కావాలంటే అది చేసుకునే వెసులుబాటిస్తూ... పేదల్ని మాత్రం మరింత పేదలుగా మార్చేసే విధానాలు అప్రతిహతంగా సాగాల్సిందేనా?

వాళ్ల నోటిముందు కూడు లాగేసుకుని తర్వాత వాళ్లు పొట్టచేత పట్టుకుని వలస పోవాల్సిందేనా? ఆనక సమస్యల మూలంలోకి వెళ్లకుండా వాళ్లకి వందరోజుల కూలీ హామీలిస్తూ యెన్నాళ్లని వాళ్లని పరాన్నభుక్కులుగా వుండనిద్దాం? యెంతకాలం వాళ్లని మన దయాదాక్షిణ్యాలు ప్రసరించేందుకు అనువైన ఆబ్జెక్ట్స్‌గా చూద్దాం?

హృదయం ద్రవించడంలేదా ధర్మాన గారూ? సప్తసముద్రాల యివతల వున్న మాకు స్పష్టంగా వినపడుతున్న ఆక్రందనలు సచివాలయంలో ప్రతిధ్వనించడంలేదా? వీటిని నిరసించే అవకాశం; మాకు లేని అవకాశం మీకు వుంది మంత్రిగారూ. స్పందించండి. మాట్లాడండి. మీ వంతు ప్రయత్నం చెయ్యండి. విశాల ప్రజల సంక్షేమం కోసం మీ 'కార్డ్' ప్లే చెయ్యండి. చేతులు కాలేంత వరకూ ఆగకండి.

మీ చేతుల్లో మేం పెట్టిన సమస్యల చిట్టాకి పరిష్కారాలు చేతల్లో చూపించండి. ప్లీజ్! మాకోసం కాదు. ప్రజలకోసం. కనీసం మీ కోసం!!

---

Srisail Reddy Panjugula, Tel: 0044-7711891762. Email: srisail@gmail.com
Rasheed Khan, Tel: 0044-7903257379. Email: nazusoft@gmail.com
Dr. Seshagiri Rao Nimmagadda, Tel: 0044-7799144037. Email: srnimmagadda@doctors.org.uk

London
United Kingdom
12 April, 2008